# గురకల గున్నేశ్వరావు

ముమ్మిడి శ్యామలా రాణి

తల్లిదండ్రులు చనిపోతూ, గున్నేశ్వరావుని బామ్మగారికి అప్పగించి మరీ పోయారు.

గున్నేశ్వరావు మీద పంచ ప్రాణాలు పెట్టుకొని పెంచింది బామ్మగారు.

గున్నేశ్వరావుని ప్రేమ కొద్ది ప్రక్కలో వేసుకుని పడుకునేది బామ్మగారు.

గున్నేశ్వరావు, బామ్మగారు నిద్రలోకి జారుకునేవారు.

మరు నిముషంలో గుర్ గుర్ గుర్ మని అదో రకమైన ధ్వనితో గురకలు తీస్తున్న మనవడిని చూసి "మా నాయనే! మా తండ్రే" అని చేయివేసి నిమురుతూ పొంగిపోయేది.

బామ్మగారు అలా పొంగిపోవడానికి కారణం లేకపోలేదు.

"పిచ్చి తండ్రి! మీ తాతగారిపోలిక మీనాన్నకు రాలేదుగాని నీకు వచ్చేసిందిరా! అచ్చం మీ తాతగారు నీలాగే, గురకలు తీసేవారు. ఆ గురకలకి వీధిలో కుక్కలన్ని ఎక్కడో దొంగలు పడ్డారనుకొని తెగ అరిచేవి. మాయదారి కుక్కలు అరచి, అరచి ఇక అరవడానికి ఓపికలేక నోళ్ళు మూసుకునేవి" అని గతం తలంచుకొని తెగ మురిసిపోయేది ఆవిడ.

బ్రతికి ఉన్న రోజుల్లో "మీ గురకలు మండిపోను, పగలల్లా ఇంటికి ఇంటిడు చాకిరి చేసి ప్రశాంతంగా కన్ను మూద్దాం అంటే ఒక్క నిముషం కళ్ళు మూసుకోనిస్తున్నారా? గుర్ గుర్ గుర్ అని తెగ గురకలు తీస్తుంటే ఇంక నేనేం నిదురపోయేది? అన్నట్లు ఇంకోమాట్ల! ఇంటిగల ఆవిడ నిముషాలమీద ఇల్లు ఖాళీ చేయమంటుంది" అని బామ్మగారు తెగ తిట్టిపోసేది.

చచ్చిన వాడి కళ్ళు చారడేసిలా. ఇప్పుడు ఆ సంగతి మరచిపోయి గురకలు తీస్తున్న గున్నేశ్వరావును ప్రేమతో తెగ మెచ్చుకొనేది.

గున్నేశ్వరావు పెరిగి పెద్దయినాక బామ్మగారు గున్నేశ్వరావు పడుకున్న గదిలో పడుకోవడానికే తెగ భయపడేది.

దెయ్యాలు.. బూతాలు... చేతబడులు లాంటి కథల్లో వస్తువులు వూగుతున్నట్లు గున్నేశ్వరావు పడుకున్న మంచం వూగడం చూసి గుండెలమీద చేయివేసుకునే వారు పాపం బామ్మగారు.

"ఓరి వెర్రి నాయనా! తాతగారే అనుకుంటే ఆయన్ని మించిపోయావురా గురకలో! పిచ్చి సన్నాసి! వచ్చే అమ్మడు నీ గురకల ప్రవాహంకి ఎలాతట్టుకుంటుందిరా బాబు!" అని పడుకున్న గున్నేశ్వరావుని చూసి అనుకునేవారు బామ్మగారు.

గున్నేశ్వరావుకి సంబంధాలు రావడం మొదలు పెట్టాయి. ధైర్యం గల పిల్లను చూసి గున్నేశ్వరావుకి చేయకపోతే వీడి గురకలకి ఆ అమ్మడు భయంతో మంచం పడుతుందని, బామ్మగారు తెలివితేటలు చూపి గున్నేశ్వరావుకి ధైర్యం గల అమ్మడు అని తెలిసిన రావులపాలెం రామనుజం పంతులు గారి రామలక్ష్మితో వివాహం జరిపించారు.

తెల్లని పైజామా, కళ్ళీలాల్చీ వేసుకొని, నుదిటిమీద కళ్యాణ తిలకం, బుగ్గనచుక్కతో అద్దంముందు నిలబడి మురిసిపోతున్న గున్నేశ్వరావుని చూసి "పిచ్చి నాయనా! నీకేంరా అంతా మీ తాతయ్యపోలికే... ఆ రోజుల్లో మీ తాతయ్య వీధివెంట వెళుతుంటే ఆడాళ్ళందరూ తలుపుచాటు నుండి చూసేవారు..... అని" గున్నూ! నీకో సంగతి చెప్పడానికి వచ్చేనురా బాబూ!....."అంది.

"ఏంటి బామ్మ?... " అన్నాడు బామ్మగారు ఏం చెప్పడానికి వచ్చారో అని'.....

"అదేనురా! ..... గున్నూ!.... ఈ రోజు.... మొదటి రోజు కదరా" అన్నారు.

"నీ మొఖం! మొదటి రోజు ఏమిటే?పద్నాలుగో తారీఖు ' అన్నాడు విసుగ్గా!

"చాల్లే! ఆ మాత్రం తెలియనివాజమ్మను ఏంటిరా గున్నూ!.... అదికాదురా నేను చెప్పేది ఈ రోజు నీ శోభనం కదురా?" అంది.

"అది తెలియని దద్దమ్మను కానే!.... అబ్బా ఎనిమిదయి పోతోంది. ఇంకా నీ నసుగుడు ఏమిటి" అన్నాడు.

"నసుగుడు కాదురా. నీకు గదిలోకి వెళ్ళేముందు ఒక విషయం చెప్పాలిరా?" అంది.

"ఏమిటి చెప్పేది మగాడిని పట్టుకొని... మరీ నన్ను దద్దమ్మను చేస్తున్నావ్? నేనేమైన ఆడపిల్లనా. గదిలోకి వెళ్ళేముందు చెప్పడానికి?" అన్నాడు విసుగ్గా గున్నేశ్వరావు.

"నీ బొంద!.... నేను చెప్పేది అదికాదురా? ఈ రోజు మొదటి రోజు రామలక్ష్మికి కొత్త కదా? నీ గురకలు విని ఏం బెంబేలు పడిపోతుందో.... అని కొంచెం మెలకువగా ఉండి గురకలు తగ్గించమని చెబుదాం అనిరా? అర్థం అయిందా?" అంది.

"ఏమిటి బామ్మ! నువ్వు. అంత పని గట్టుకొని చెప్పడం. ఏం తాతయ్యను వదిలి నువ్వు పారిపోయావా?" అన్నాడు కోపంగా.

గున్నేశ్వరావు, రామలక్ష్మి, పలకరింపులు, కబుర్లు కాకరకాయలు అయిన అనంతరం నిద్ర కుపక్రమించారు.

దిండు మీద పడుకోబోతున్న రామలక్ష్మిని....

"రామలక్ష్మీ! ఈ రోజునుండి నీకు దిండుతో పనిలేదు. నాహృదయమే నీకు దిండు. రా!.... ఇలా పడుకో" అన్నాడు.

తన అదృష్టానికి మురిసిపోతు..... గున్నేశ్వరావు హృదయమే దిండుగా అనుకొని పడుకొంది రామలక్ష్మి.

సమయం దొర్లుతుంది.

గుర్.... గుర్.... గుర్ అని భయంకరమైన యుద్ధకాండంలో ఫిరంగులు.... తుపాకులు పేల్చులు శబ్దంలా భయంకరంగా గుర్ గుర్ అని ధ్వని వినబడుతుంటే రామలక్ష్మి వళ్ళు అంతా చమటతో తడసి, గుండె దడతో కళ్ళు తెరవడానికి భయం వేసి, కళ్ళు గట్టిగా మూసుకొని, ధ్వని ఎక్కడి నుండి వస్తుందా అని ఆలోచించ సాగింది.

నిముష నిముషానికి ధ్వని ఎక్కువకావడమే కాకుండా, మంచం చిన్నగా ఊగుతున్నట్లు కావడంతో.... ప్రఖ్యాతి రచయిత (త్రి) కథలో దయ్యాలు గుర్తు వచ్చి "అయ్య బాబోయ్!" అని పెద్దకేక వేసింది.

కాలం దొర్లుతోంది.

గున్నేశ్వరావు, రామలక్ష్మి ప్రక్కలో పడుకున్న పసివాడు కెవ్వున అరవడం మొదలు పెట్టాడు.

పసివాడికి ఏమయిందో అని గాభరగా లేచి చూసింది రామలక్ష్మి.

కాళ్ళు చేతులు కొట్టుకొని మూతి బిగించి ఏడుస్తున్న చంటోడిని చూసి దుఃఖం ఆగలేదు.

చంటోడు గుక్కపట్టి ఏడుస్తున్నా, భయంకరంగా గురక తీస్తూ నిద్రపోతున్న భర్తను చూసి ఎక్కడలేని కోపం, చిరాకు వచ్చి "ఏమిటండి మీ వెధవ గురకలు అనీ ఒక్క పోటు పొడిచి, చూడండి బాబుకి కడుపునొప్పి ఏమిటో గంట నుండి ఏక బిగువున ఏడుస్తున్నాడు, హాస్పటల్‌కి వెళదాం" అంది.

నిద్రలో నుండి గున్నేశ్వరావు కంగారుగా లేచి, "ఆ... ఏమిటి?" అన్నాడు.

అంతే మరు నిముషం.... చంటోడు ఏడుపుమాని అర్ధరాత్రో అపరాత్రో తెలియనట్లు పసివాడిలా ఆడుకోవడం మొదలు పెట్టాడు.

ఏదో అర్థం అయినదానిలా, మీ గురకలు మండిపోను" అని; "నా తండ్రి మీ దిక్కుమాలిన గురకలకి హడలిపోయి ఏడుస్తున్నాడు" అంది.

పెళ్ళయిన క్రొత్త రోజుల్లో "ఏమిటండి మీ గురకలు అని సిగ్గు పడుతు అనే భార్య మాటలు గుర్తు వచ్చి, "నా ఇల్లు.... నా ఇష్టం.... ఇంకా గట్టిగా గురకలు పెడతాను, నువ్వెవరు" అన్నాడు కోపంగా.

"సిగ్గు లేకపోతే సరి!.... ఎవరైనా పెంటే నవ్విపోతారు. ఎన్ని రాత్రులు మీ గురకలకి నిద్ర లేకుండా గడిపానో? నేనయితే సరిపెట్టుకున్నాను. మొన్నటికి మొన్న మా పుట్టింటి నుండి వస్తున్నప్పుడు రైలు ఇంజను కూతకి ఏడ్చాడు. మళ్ళా ఇప్పుడు మీ గురకలకి భయపడిపోయి ఇలా ఏడ్చాడు" అంది కళ్ళ నీళ్ళు పెట్టుకొని.

"ఏడ్వనీయవే అంత ధైర్యంగలవాడిని కన్నావ్" అన్నాడు కోపంగా!"

రోజులు దొర్లుతున్న కొలది చంటోడు నిద్రలేక చిక్కిశల్యమై పోయాడు. చంటోడిని చూస్తూ బెంగతో చిక్కిసగం అయింది రామలక్ష్మి.

ఆఫీసు నుండి వచ్చిన గున్నేశ్వరావు వీధిగదిలో మంచంచూసి, అసలు విషయం అర్థం అయిన వాడిలా వంట గదిలోకి దారి తీశాడు.

"ఏం రామలక్ష్మి!... ఏమిటి నీ ఉద్దేశం నీ మంచం వీధిగదిలో వేసావ్? అసలు నీ ఉద్దేశం ఏమిటి" అన్నాడు.

"నా ఉద్దేశం ఎలాగున్నా ఇరుగు పొరుగువాళ్ళు చెవులు తెగ కొరుక్కుంటున్నారండి..... చంటోడు తెల్లవార్లు ఏడవడం మీగురకలు గూర్చి కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. అలా చెప్పుకోవడం ఇష్టం లేక ఇలా పడకలు మార్చను. మీరా గదిలో పడుకోండి" అంది.

అయితే నేను నీకు అక్కరలేదా? నువ్వు వేరుగా పడుకున్న పక్షంలో ఇక నీకు నాకు సంబంధం ఏమిటి? .... ఇప్పుడే మీ పుట్టింటికి వెళ్ళిపో.... " అన్నాడు కోపంగా గున్నేశ్వరావు.

'అలాగే ఉండి!.... రేపొద్దున్న వరకు ఆగండి. నాతండ్రి కన్నా నాకీ లోకంలో ఇంకేది ఎక్కువ కాదు" అంది రామలక్ష్మి.

* * * * * *

యువర్ ఆనర్!.... ఈమె అనగా గున్నేశ్వరావు గారి భార్య రామలక్ష్మి విడాకులు కోరతంలో తప్పులేదు. పెళ్ళయిన రాత్రి మొదలు ఇప్పటి వరకు కూడ ఈమె ఒక్కనాడు కూడ కంటి నిండా నిద్ర ఎరుగదు....

అయినా భారత స్త్రీ కాబట్టి పతియే ప్రత్యక్ష దైవం అని ముద్దాయి అనగా భర్త భయంకరమైన గురకలు, భరించింది. తరువాత ఈమెకు కొడుకు పుట్టాడు. ప్రతిరాత్రి పసివాడు ఈ ముద్దాయి భయంకరమైన గురకలకి భయపడి నిద్రమాని ఒకటే ఏడుపు రోజులు గడుస్తున్న కొలది చిక్కి శల్యం అయిపోసాగాడు దీనికి సాక్షులు ఆ వీధిలో ఉండే అప్పారావు, రంగారావు, బుచ్చిబాబు, తాయారమ్మ, బంగారమ్మ, చిట్టితల్లి.

**తనకోసం భర్త గురకలు భరించినా తన కొడుకు** బ్రతికి బలుసాకు తినాలని భర్త నుండి విడాకులు కోరుతున్నారు రామలక్ష్మిగారు. స్వాతంత్ర భారతదేశంలో ప్రతి మనిషి స్వతంత్రుడే! ఈమెకు జడ్జిగారు భయంకరమైన ముద్దాయి గురకలు నుండి విడిపోయి స్వతంత్రంగా బ్రతకడానికి విడాకులు ఇవ్వవలసినది అని కోరుతున్నాను అన్నాడు లాయరు.

పవిత్ర భారత దేశంలో ప్రతి మనిషికి కొన్ని హక్కులున్నాయి. ముద్దాయి గున్నేశ్వరావు గురకలు భయంకరమైనవి అని సాక్షుల ఆధారం మూలాన రామలక్ష్మిగారికి విడాకులు మంజూరు అయినవి.

"నో! ...నో!.... ప్లీజ్... రామలక్ష్మి, బాబు నాకు కావాలి! అని పిచ్చివాడిలా పెద్ద కేకలు నిద్రలో వేస్తున్న భర్తను "ఏమండీ! ఏమయిందండి?".... అంది కంగారుగా రామలక్ష్మి.

తను ఇప్పటి వరకు కల కన్నాడా? ఎంత భయంకరంగా ఉంది?

ఏమో! రామలక్ష్మి పడకలు మార్చింది. తరువాత ఏమో జరగకూడనివి జరిగితే.

అయితే.... తను ఇప్పుడు చేయవలసిన పని.... తన గురకలకి నివారణోపాయం ఆలోచించాలి.

ఆలోచన రావడమే తడవుగా గబగబా తయారై బయటకు వెళుతున్న భర్తను, "ఏమండీ! పదింటికి కదా ఆఫీసు . ఇప్పుడు ఎక్కడికండి" అంది.

"నాగురకలు పోవడానికి మార్గం ఉందా అని అడగడానికి డాక్టరు దగ్గరకు వెళుతున్నాను. ఒకవేళ మందులు లేకపోయినా నాగురకలు ఈ రోజు నుండి నీకు, బాబుకి వినబడకుండా ఉండడానికి ప్రయత్నిస్తాను రామలక్ష్మి..... నిన్ను.... నిన్ను బాధపెట్టాను నన్ను క్షమించవూ?" అన్నాడు గున్నేశ్వరావు.

"ఏమండీ! ఇంత మాట అనకండి" అని విప్పారిన నేత్రాలతో గున్నేశ్వరావు వైపు చూసింది రామలక్ష్మి. □

